సాక్షి మహబూబ్‌నగర్

శనివారం । 26 । అక్టోబర్ । 2024



జోగుళాంబకు లక్ష్మీకటాక్షం

అలంపూర్ ఆలయాలకు సంబంధించి నిర్వహించిన వేలం సిరులు కురిపించింది.

వివరాలు 10లో ▸



సుంకేసులకు తగ్గిన వరద

సుంకేసులకు ఎగువ నుంచి వస్తున్న వరద శుక్రవారం తగ్గుముఖం పట్టింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.9 /18.6

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇథనాల్ కంపెనీ రద్దుపై చర్యలు తీసుకోరా?

పాలమూరు: జిల్లాలో రాహుల్‌గాంధీ **జోడో** యాత్ర చేసిన సందర్భంలో ఇథనాల్ **కంపెనీ** రద్దు కోసం రైతులకు తోడుగా **ఉండాలని** రేవంత్‌రెడ్డిని ఆదేశించారని, ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా సదరు కంపెనీ రద్దుపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కంపెనీపై చర్యలు తీసుకోపోగా పైగా రైతుల మీద నిర్బంధం కేసులు అధికమయ్యాయని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇథనాల్ కాలుష్యానికి ప్రయోగశాలగా మార్చారని విమర్శించారు. ఇప్పటికైనా ఇథనాల్ కంపెనీపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నేడు దిశ కమిటీ సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దిశ (జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ క మిటీ) సమావేశం శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుండగా, జిల్లాలో ఎమ్మెల్యేలు ఆయా శాఖల అధికారులు హాజరు కానున్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో అమలు చేస్తున్న పథకాలపై అధికారులతో సమీక్షించనున్నారు.

29న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలోని బాదేపల్లి బాలుర జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈ నెల 29న జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 14, 17 విభాగాల బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనేవారు పాఠశాల బోనోఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, ఇంటర్ విద్యార్థులు అయితే ఎస్సెస్సీ ఒరిజినల్ మెమోతో హాజరుకావాలని ఆమె కోరారు. పూర్తి వివరాల కోసం రామ్‌కల్యాణ్‌జీ సెల్ నం.94923 53037ను సంప్రదించాలని సూచించారు.

మహా ధర్నా వాయిదా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను వాయిదా వేస్తున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, కార్మికులు, ఆర్టిజన్లు ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించినందుకు ధర్నాను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,496


జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి 4,850 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. క్వింటాల్ గరిష్టంగా రూ.2,496, కనిష్టంగా రూ.1,450 ధరలు లభించాయి.

ఆర్‌ఎన్‌ఆర్ ధర రూ. 2219

దేవరకద్ర మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,219, కనిష్టంగా రూ.2,069 ధరలు లభించాయి. హంస ధాన్యం గరిష్టంగా రూ.1,981, కనిష్టంగా రూ.1,889 చొప్పున వచ్చాయి. అలాగే ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,769 ఒకే ధర పలికింది. మార్కెట్‌లో సీజన్ ప్రారంభం కావడంతో 500 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

పట్టణ సొబగులు

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలు



మహబూబ్‌నగర్ పట్టణ వ్యూ

మహబూబ్‌నగర్ యుడీఏ మరింత విస్తరణ

- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అభివృద్ధి దిశగా సాగనున్న వెనకబడిన ప్రాంతాలు
- మెరుగుపడనున్న మౌలిక వసతులు, ఉద్యోగావకాశాలు

గద్వాల: వలస కూలీలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి.. వెనకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిన ఉమ్మడి పాలమూరు రూపురేఖలు సమూలంగా మారబోతున్నాయి. శివారు ప్రాంతాలు, పల్లెలు అన్నీ కలుసుకొని పట్టణ సొబగులు అద్దుకోనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పాలమూరులోని జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ ప్రాంతాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలుగా ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా.. ఇప్పటికే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాను మరింత విస్తరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో రానున్న రోజుల్లో ఉమ్మడి పాలమూరు ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.

మహబూబ్‌నగర్ అర్బన్ అథారిటీ (విస్తరణ పెంపు)



మున్సిపాలిటీలు 3
(మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్)
గతం లోనివే..

ఎంపికైన మండలాలు 12
(గండేడ్, మహమ్మదాబాద్, మిడ్జిల్, దేవరకద్ర, హన్వాడ, చిన్నచింతకుంట, కౌకుంట్ల, అడ్డాకుల, బాలానగర్, నవాబ్‌పేట, కోయిల్‌కొండ, జడ్చర్ల) భూత్పూర్, రాజాపూర్, మూసాపేట, మహబూబ్‌నగర్ రూరల్ మండలాలు గతం లోనివే..

ఎంపికైన గ్రామాలు 153

జోగుళాంబ గద్వాల అర్బన్ అథారిటీ



మున్సిపాలిటీలు 4
(గద్వాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి)

ఎంపికైన మండలాలు 13
(కేటీదొడ్డి, ధరూరు, గద్వాల, ఇటిక్యాల, ఎర్రవల్లి, మల్దకల్, గట్టు, అయిజ, రాజోలి, వడ్డేపల్లి, మానవపాడు, ఉండవెల్లి, అలంపూర్)

ఎంపికైన గ్రామాలు 194

నాగర్‌కర్నూల్ అర్బన్ అథారిటీ



మున్సిపాలిటీలు 4
(నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట)

ఎంపికైన మండలాలు 18
(తిమ్మాజిపేట, బిజినేపల్లి, నాగర్‌కర్నూల్, తాడూరు, తెలకపల్లి, కల్వకుర్తి, ఉర్కొండ, వెల్దండ, చారకొండ, వంగూరు, కోడేరు, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, పెంట్లవెల్లి, అచ్చంపేట, బల్మూర్, లింగాల, ఉప్పునుంతల)

ఎంపికైన గ్రామాలు 319

వనపర్తి అర్బన్ అథారిటీ



మున్సిపాలిటీలు 5
(వనపర్తి, అమరచింత, ఆత్మకూర్, కొత్తకోట, పెబ్బేరు)

ఎంపికైన మండలాలు 14
(అమరచింత, మదనాపురం, పెద్దమందడి, ఘనపురం, గోపాల్‌పేట, రేవల్లి, పాన్‌గల్, వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు, శ్రీరంగాపూర్, వీపనగండ్ల, చిన్నంబావి, ఎదుల)

ఎంపికైన గ్రామాలు 215

అభివృద్ధి దిశగా అడుగులు..

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఎంపికైన ప్రాంతాలు అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా దూసుకెళ్తాయి. ఇందుకు ఉదాహరణే హైదరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో చోటుచేసుకున్న మార్పులు. ప్రధానంగా పట్టణీకరణ, పరిశ్రమలు, కార్పొరేట్ స్థాయి వ్యాపార సముదాయాలు, రహదారులు, తాగునీరు వసతి, మౌలిక సదుపాయాలు వంటివి చేపడుతారు. తద్వారా ఈ ప్రాంతాల్లో స్థానికంగానే అన్నివర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరగుపడటమే కాకుండా.. ప్రైవేటు, కార్పొరేట్ సెక్టార్లలో యువతకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. దీంతో జీవనోపాధి కోసం పాలమూరు ప్రజలు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా.. స్థానికంగానే మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఒక రెవెన్యూ డివిజన్‌తోపాటు, నాలుగు మున్సిపాలిటీలు, 13 మండలాలు, 255 గ్రామ పంచాయతీలు, 303 గ్రామాలున్నాయి. ఇందులో నాలుగు మున్సిపాలిటీలైన గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లితో పాటు జిల్లాలోని 194 గ్రామాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఎంపిక చేసింది.
- నాగర్‌ర్నూల్ జిల్లాలోని మొత్తం నాలుగు మున్సిపాటీలు, అమ్రాబాద్, పదర మండలాలు మినహా అన్ని మండలాల్లోని 319 గ్రామాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో చేర్చారు. వనపర్తి జిల్లాలోని మొత్తం 5 మున్సిపాలిటీలతో పాటు 215 గ్రామాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా గుర్తించారు.
- ఇప్పటికే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాను మరింత విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ పట్టణంతో పాటు జిల్లాలోని 153 గ్రామాలను ఇందులో చేర్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

పట్టణీకరణ చెందుతాయి..

గద్వాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీని పరిధిలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలతో పాటు 194గ్రామాలు విలీనం కానున్నాయి. రహదారులు, తాగునీటి వసతి, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి. అలాగే పల్లెలు సైతం పట్టణీకరణ చెందుతాయి. ఈ ప్రాంతాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి చేపడుతారు. - నర్సింగ్‌రావు, అదనపు కలెక్టర్, జోగుళాంబ గద్వాల

విద్యా ప్రమాణాలను పెంచడమే లక్ష్యం



బాలికల ఏటీసీ శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, చిత్రంలో కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, తదితరులు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

- పాలమూరులో మంత్రి విస్తృత పర్యటన
- ఏటీసీ సెంటర్‌కు శంకుస్థాపన, టాస్క్ స్థల పరిశీలన

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో విద్యాప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జిల్లాకేంద్రంలో మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం వివిధ శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రాంగణంలో రూ.9.48 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత బాలుర, బాలికల అధునాతన సాంకేతిక కేంద్ర భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో బాలికల కళాశాలను ఏటీసీగా మార్చామని, త్వరలో బాలుర కళాశాలను కూడా ఏటీసీ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే టాస్క్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నామని, త్వరలో జిల్లాకేంద్రంలో టాస్క్ సెంటర్‌ను ప్రారంభించుకుంటామన్నారు. రానున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి ఒక విభాగాన్ని జిల్లాలో కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాలమూరు యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు అనుగుణంగా సాంకేతికపరమైన ఇంకూబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఇక్కడి ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు.

- అనంతరం మధురానగర్‌లో రెడ్డిహాస్టల్ వద్ద ఎమ్మెల్యే యెన్నం యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఫస్ట్ శిక్షణ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. దివిటిపల్లిలోని ఐటీ పార్క్‌ను సందర్శించారు. కంపెనీల ప్రతినిధులతో మంత్రి పలు అంశాలపై చర్చించారు. అమరరాజా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, మార్కెట్ చైర్మన్ అనిత, వైస్ చైర్మన్ విజయ్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు సువర్ణ అధ్యాయం ప్రారంభం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు జిల్లాకు ఒక సువర్ణ అధ్యాయం ప్రారంభమైందన్నారు. జిల్లాలో మొట్టమొదటిగా ఒక అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఐటీఐ చేసే విద్యార్థులకు మంచి రోజులు రానున్నాయని తెలిపారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండు నేషనల్ హైవే ఉన్నాయని, ఈ ప్రాంతాల్లో డ్రైపోర్టు, స్కిల్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్‌లో స్కిల్‌డెవలప్‌మెంట్ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలో కృష్ణా, మాగనూర్ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరితే సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వరంగంలో ఒక బాలుర, ఒక బాలికల ఐటీఐ కళాశాలలు ఉన్నాయని అన్నారు. బాలికల ఐటీసీలో 172 మంది బాలికలకు అడ్మిషన్లకు అవకాశం ఉందని, ఇప్పటివరకు 100 మంది అడ్మిషన్లు పూర్తయ్యాయని, ఆసక్తి గల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చాం

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50 వేలకుపైగా ఉద్యోగాలు ఇచ్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి తగిన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యార్థులకు అధునాతనమైన, సాంకేతికతలో శిక్షణ ఇవ్వడానికి రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మారుస్తున్నట్లు వివరించారు. ఈ సెంటర్లలో ఆరు కోర్సులు ఉంటాయని, టాటా టెక్నాలజీ సంస్థ ద్వారా రూ.2,200 కోట్లు, మరో రూ.400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఏటీసీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. టాటా టెక్నాలజీ సంస్థ వారే విద్యార్థులకు శిక్షణ అందిస్తారన్నారు. దీంతో పరిశ్రమలు, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు.

గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.ఇందిర

పాలమూరు: జిల్లాలోని ప్రతి గ్రామంలో బాల్య వివాహాలు, బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. పట్టణంలోని బాల రక్ష భవన్‌లో శుక్రవారం సీడబ్ల్యూసీ సభ్యులు, డీసీపీఓ, సీడీపీఓలు, చైల్డ్ లైన్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను అన్నిరంగాల్లో రాణించే విధంగా వారిని ప్రోత్సహించాలని, చిన్న పిల్లలు తెలియని వయసులోనే బాల నేరస్థులుగా మారుతున్నారని చెప్పారు. పిల్లలకు వారి హక్కులు, బాధ్యతలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. బాలలకు సంబంధించిన పథకాలను అభివృద్ధి చేయాలన్నారు.

- జిల్లాకేంద్రంలోని శిశుగృహ, చిల్డ్రన్ హోంలను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర సందర్శించారు. స్థానికంగా ఉన్న మంచినీటి సౌకర్యం, ఆహారం, పరిసరాలు ఎలా ఉన్నాయని పరిశీలించారు. పరిసర ప్రాంతాలు ఈగలు, దోమలు రాకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా పెట్టుకోవాలని సదరు సిబ్బందికి సూచించారు. పిల్లలతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకుని సరైన ఆహారం అందుతుందా.. లేదా అని ఆరాతీశారు. పిల్లలకు అవసరమైన సమయాల్లో వైద్య చికిత్స అందించాలని సూచించారు.

ఎస్‌ఏ-1 పరీక్ష పరిశీలనకు కమిటీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో ఎస్‌ఏ-1 పరీక్షల పరిశీలనకు ప్రత్యేకంగా పర్యవేక్షణ కమిటీలు వేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇందులో ప్రతి కాంప్లెక్స్ పరిధిలోని హెచ్‌ఎం, ఒక స్కూల్ అసిస్టెంట్ పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రతిరోజు కాంప్లెక్స్ పరిధిలో ఉండే ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేయనున్నారు. ఎస్‌ఏ- 1 సోషల్ పేపర్ ప్రశ్నపత్రం లీకవడంపై శుక్రవారం 'సాక్షి'లో 'ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రం లీక్' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై విద్యాశాఖ సీరియస్‌గా తీసుకుంటున్నట్లు డీఈఓ రవీందర్ తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో పరీక్ష సమయానికి ప్రారంభమైందా.. ప్రశ్నపత్రాలు పరీక్ష కంటే ముందే ఓపెన్ చేస్తున్నారా.. ఎంత సమయం పరీక్ష నిర్వహిస్తున్నారు.. తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు చెప్పారు. అలాగే గురువారం సోషల్ పరీక్ష ప్రశ్నపత్రం సోషల్ మీడియాలో పోస్టులు చేసిన పలువురిని గుర్తించినట్లు తెలుస్తుంది. వీరికి శనివారం నోటీసులు ఇచ్చి, సోషల్ మీడియాలో ప్రశ్నపత్రాలు పోస్టు చేయడానికి కారణాలను తెలుసుకుంటామని డీఈఓ వివరించారు. ప్రధానంగా ఏ పాఠశాల నుంచి లీక్ అయ్యిందో ఆరాతీస్తున్నట్లు సమాచారం.

సాక్షి ఎఫెక్ట్..



'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనం

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



దిగువ జూరాలలోని పవర్‌హౌజ్ కేంద్రం

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. శుక్రవారం దిగువ కేంద్రంలో 290 మి.యూ. లక్ష్యంగా కాగా.. 291 మి.యూ. ఉత్పత్తి చేపట్టి లక్ష్యాన్ని అధిగమించామని ఎస్‌ఈ సూరిబాబు తెలిపారు. ఎగువలో 320 మి.యూ. లక్ష్యానికిగాను 309 మి.యూ ఉత్పత్తి చేపట్టామని వివరించారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 309.687 మి.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 291.292 మి.యూ. ఉత్పత్తి చేపట్టామన్నారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో ఇప్పటి వరకు 600.979 మి.యూ., విద్యుదుత్పత్తి సాధించామని చెప్పారు.

జిల్లాలో పశుగణనకు శ్రీకారం



అఖిల భారత పశుగణన పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, తదితరులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలోని 441 గ్రామాలతోపాటు మున్సిపాలిటీల్లో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధకశాఖ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ విజయేందిర బోయి చేతుల మీదగా పశుగణన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశుగణన కార్యక్రమం ద్వారా జిల్లాలో ఎన్ని పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల సంఖ్యను బట్టి ప్రభుత్వ విధానాలు, పశుసంవర్ధకశాఖ ద్వారా రైతులకు ఎలాంటి పథకాలు రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు పరచాలనే విషయం తెలుస్తుందన్నారు. పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రలు బృందాలుగా వెళ్లి సర్వేను నిర్వహిస్తారన్నారు. డిజిటల్ పద్ధతిలో మొబైల్ అప్లికేషన్ ద్వారా రైతుల ఇంటి వద్దనే వివరాలను నమోదు చేస్తారని, పశుగణన కార్యక్రమం పర్యవేక్షణ కోసం సంబంధిత మండలాల పశువైద్యాధికారులను సూపర్‌వైజర్లుగా నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్‌గౌడ్, నోడల్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారులు రాంప్రసాద్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీజీఎం చిన్మయికుమార్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ సీజీఎం చిన్మయికుమార్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆఫీస్ ఆఫ్ ది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబుడ్స్‌మన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ కార్యాలయంలో సైబర్ నేరాలపై వినియోగదారులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఐ ఆధ్వర్యంలో సైబర్ సురక్షిత్ భారత్, నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న శిక్షణార్థులకు, అలాగే చుట్టుపక్కల నుంచి వచ్చిన వారందరికీ సైబర్ ఫ్రాడ్స్ వలన మోసపోకుండా ఏం జాగ్రత్తలు తీసుకోవాలో వివరించినట్లు చెప్పారు. సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి.. ప్రజలు ఎలా సురక్షితంగా ఉండాలో అవగాహన కల్పించామన్నారు. దీంతో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబుడ్స్‌మన్ స్కీం, 2021 గురించి కూడా వివరించడం జరిగిందన్నారు. వినియోగదారులు ఏమైనా ఫిర్యాదు చేయాల్సి వస్తే మొదటగా బ్యాంక్ బ్రాంచ్‌లో సంప్రదించి కంప్లయింట్ రాతపూర్వకంగా, ఈ-మెయిల్ ద్వారా ఇవ్వవచ్చన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబుడ్స్‌మన్ స్కీం-2021, సైబర్ సురక్షిత్ భారత్‌పై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం బాలతేజ, లోకేష్, బిపిన్ కుమార్‌సింగ్, అనిల్‌కుమార్, భాస్కర్, శ్రీవాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత మృతి : భర్తపై కేసు నమోదు


స్వాతి (ఫైల్)

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం గ్రామానికి చెందిన స్వాతి (19) చికిత్స పొందుతూ మృతిచెందగా.. తల్లి ఫిర్యాదు మేరకు శుక్రవారం భర్త శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణంరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. అమీన్‌పూర్‌కు చెందిన జ్యోతి, సిద్దప్ప కుమార్తె స్వాతిని పెద్దజట్రం గ్రామానికి చెందిన బండప్ప కుమారుడు శ్రీనివాస్‌కు ఇచ్చి 6 నెలల కిందట వివాహం జరిపించారు. మూడురోజుల కిందట స్వాతి అస్వస్థతకు గురికావడంతో మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. తమ కుమార్తె మృతిపై అనుమానం ఉందని తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

నీళ్లు అనుకొని యాసిడ్ తాగి వ్యక్తి మృతి

అచ్చంపేట రూరల్: మద్యం మత్తులో యాసిడ్(బాత్రూం శుభ్రం చేసే లిక్విడ్) తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట కిష్యాతండాలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...తండాకు చెందిన రైతు కేతావత్ భీక్య(40) కొన్నేళ్లుగా మద్యానికి బానిసై ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 18న పూటుగా తాగిన భీక్య ఇంటిలో ఎవరూ లేని సమయంలో దాహం వేయడంతో.. ఇంట్లో ఓ బాటిల్‌లో ఉన్న యాసిడ్‌ను నీళ్లు అనుకొని తాగాడు. గొంతు, కడుపులో విపరీతమైన నొప్పి రావడంతో అరుపులు వేశాడు. గమనించిన సోదరుడు శంకర్ ఇంటిలోకి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉండటం చూసి భీక్య భార్య చిట్టి సమాచారం అందించి వెంటనే అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వైద్యులు రెఫర్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి


రాములు (ఫైల్)

చిన్నచింతకుంట: మండలంలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మద్యం మత్తులో యువకుడు ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన లాల్‌కోటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆర్ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నచింతకుంట మండలం లాల్‌కోటకు చెందిన గుడబర్ల రాములు(24)ఈ నెల 19న రాత్రి సమయంలో మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. అదే మత్తులో ఇంట్లో ఉన్న డీజిల్ ఒంటిపై పోసుకోని నిప్పు అంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

- నర్వ మండలం రాంపురం గ్రామానికి చెందిన వడ్డే పెద్ద అంజన్న గురువారం సాయంత్రం చిన్నచింతకుంట మండలంలోని అమ్మపురం నుంచి స్కూటీపై రాంపురం వెళ్తుండగా, ఏదులాపురం గ్రామ సమీపంలో స్కూటీ అదుపు తప్పి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతని కుమారుడు వడ్డే గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపాడు.

పాలమూరులో దొంగల హల్‌చల్

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరు పట్టణంలో దొంగల అలజడి అధికమవుతుంది. ఇటీవల చెడ్డీ గ్యాంగ్ తరహాలో ఐదుగురు ముఠా సంచారం చేసిన ఘటన మరవక ముందే తాజాగా మరో ముగ్గురితో కూడిన గ్యాంగ్ హల్‌చల్ చేయడం జరిగింది. టీషర్ట్స్, షార్ట్‌లు వేసుకుని ముఖాలకు మాస్కులు ధరించి కాలనీల్లో సంచరించారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో లక్ష్మీనగర్‌కాలనీలోని ఓ వ్యక్తి ఇంట్లోకి చోరీ చేయడానికి ముగ్గురు వ్యక్తులు ప్రయత్నించి విఫలమయ్యారు. ఇంట్లో ఎవరూ లేరని భావించిన దొంగలు లోపలికి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో అలికిడి కావడంతో మేలుకున్న ఇంట్లోని వాళ్లు కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యారు. దొంగతనానికి ప్రయత్నించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. అయితే దొంగలు వచ్చారని రాత్రి డయల్ 100కు కాల్ చేయగా సకాలంలో రెస్పాన్స్ కాలేదు. అదే సమయంలో బృందావన్‌కాలనీలో కూడా దొంగలు హల్‌చల్ చేసినట్లు సమాచారం రాగా అక్కడికి వెళ్లినట్లు స్థానికులకు పోలీసులకు తెలిపినట్లు తెలుస్తోంది. పోలీసులకు సమాచారం ఇచ్చిన సమయంలో ఘటనా స్థలానికి వచ్చి ఉంటే దొంగలను పట్టుకునే అవకాశం ఉండేదని స్థానికులు చెబుతున్నారు. అయితే తరచుగా లక్ష్మీనగర్‌కాలనీనే లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు.

జోగుళాంబకు లక్ష్మీ కటాక్షం


ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

- అలంపూర్ ఆలయాలకు సమకూరిన రూ.3.48 కోట్ల ఆదాయం
- కనీవిని ఎరుగని రీతిలో సాగిన వేలం పాట
- గతేడాదితో పోలిస్తే రూ.1.64 కోట్లు అధికం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాలకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన వేలం పాటలు సిరులు కురిపించాయి. వివరాల్లోకి వెళ్తే.. జోగుళాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. దశాబ్దాలుగా ఒకే వర్గం టెండర్లు దక్కించుకుంటుందన్న కారణంతో ఈసారి పలువురు వేలంలో పాల్గొన్నారు. టెండర్లలో ప్రతిసారి ఆలయానికి అన్యాయం జరుగుతుందని భావించిన కొందరు రాజకీయ నేతలు తెర వెనుక నుంచి గట్టి పోటీ ఇప్పించారు. టెంకాయలు, పూజ సామగ్రి విక్రయానికి గతేడాది రూ.55.20 లక్షలు పలకగా.. ఈ ఏడాది మహేష్‌గౌడ్ ఏకంగా రూ.1.27 కోట్లకు దక్కించుకున్నారు. అలాగే వాహన పార్కింగ్ గతేడాది రూ.55 లక్షలు ఉండగా.. ఈ ఏడాది రూ.70 లక్షలకు సతీష్‌రెడ్డి కైవసం చేసుకున్నారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు విక్రయించేందుకు గతేడాది రూ.29 లక్షలు రాగా.. ఈ ఏడాది మహేష్‌గౌడ్ ఏకంగా రూ.91 లక్షలు పాట పాడారు. ఫొటోలు, క్యాసెట్లు, పుస్తకాల విక్రయానికి గతేడాది రూ.5.50 లక్షలుండగా.. ఈ ఏడాది రూ.22 లక్షలకు ఐ.వెంకట్రామిరెడ్డి దక్కించుకున్నారు. వసతి గదులు గతేడాది రూ.8.75 లక్షలు రాగా.. ఈ ఏడాది బి.రమేష్ రూ.9.50 లక్షలు పాట పాడి చేజిక్కించుకున్నారు. శౌచాలయాల నిర్వహణను రూ.7.20 లక్షలకు సుంకన్న, దేవస్థానం క్యాంటీన్ నెల అద్దె గతేడాది రూ.43 వేలు ఉండగా.. ఈసారి జానకిరాముడు రూ.76 వేలకు దక్కించుకున్నారు.

వేలం పాట ఆద్యంతం ఉత్కంఠగా సాగడంతో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఆదాయం సరే వసూలు చేస్తారా?

వేలం పాట చూసిన పలువురు స్థానికులు ఆదాయం బాగానే వచ్చింది.. కొత్త పాలక మండలి ఈ డబ్బులు వసూలు చేయగలరా అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

కురుమూర్తిస్వామి పట్టువస్త్రాల తయారీకి శ్రీకారం


పట్టువస్త్రాల తయారీకి పట్టు నూలును అతుకుతున్న నేతన్న


జాతర మైదానంలో బస్ స్టాప్‌లకు స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఆర్‌ఎం శ్యామల

అమరచింత: ఉమ్మడి పాలమూరు జిల్లాలో పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తిస్వామికి పట్టువస్త్రాలను సమర్పించే పనులకు అమరచింత పద్మశాలి కులస్తులు శ్రీకారం చుట్టారు. స్థానిక భక్త మార్కండేయ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక మగ్గం ఏర్పాటు చేసి పట్టువస్త్రాల తయారీ కోసం ధారం పోగులను అల్లే పనుల్లో నేతన్నలు నిమగ్నమయ్యారు. కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం స్వామివారి అలంకరణ రోజున స్వామివారికి సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారమని పద్మశాలీలు వెల్లడించారు. స్వామివారి అలంకరణ నవంబర్ 6న జరుగుతుందని అప్పటి వరకు స్వామివారికి పట్టువస్త్రాలైన పట్టు పంచెలు, అమ్మవారికి పట్టు చీరను తయారు చేసి సమర్పించనున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర సందర్భంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని డీపీఓ పార్థసారథి అన్నారు. కురుమూర్తిస్వామి జాతరను పురస్కరించుకొని శుక్రవారం ఆలయం వద్ద దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాల పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయ పరిసరాలు, జాతర మైదానంలో చెత్తాచెదారం, మురుగు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణదారులు చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకొని అందులోనే వేసేలా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని, ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానాలు విధించాలని చెప్పారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి నసీరుద్దీన్, ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొలువుదీరనున్న పాలక మండలి


గోవర్ధన్‌రెడ్డి

కురుమూర్తిస్వామి ఆలయ నూతన పాలక మండలి శనివారం కొలువుదీరనుంది. ఈ మేరకు కొత్తకోట మండలం ముచ్చింతలకు చెందిన గౌని గోవర్ధన్ రెడ్డి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హాజరవుతారని ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన డిప్యూటీ ఆర్‌ఎం

జాతర మైదానంలో బస్ స్టాపులను ఏర్పాటు చేసేందుకు శుక్రవారం డిప్యూటీ ఆర్‌ఎం శ్యామల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుమూర్తిస్వామి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని, వీరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు నడిపిస్తామన్నారు. జాతర మైదానం అమ్మాపురం మార్గంలోని స్వామివారి ముఖద్వారం సమీపంలో నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, కొల్లాపూర్ సంబంధించిన బస్సులు నిలిపేందుకు, సబ్‌స్టేషన్ సమీపంలో మహబూబ్‌నగర్, నారాయణపేట డిపోల బస్సులు నిలిపేలా స్టాపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆమె వెంట ఆర్టీసీ డిప్యూటీ ఆపరేషన్ ఆర్‌ఎం లక్ష్మీధర్మ, మహబూబ్‌నగర్, నార్‌కర్నూల్, వనపర్తి, కొల్లాపూర్ డీఎంలు సుజాత, ఉమాశంకర్, యాదయ్య, వేణుగోపాల్ తదితరులున్నారు.

నిర్మల్ రైతులను అడ్డుకున్న పోలీసులు


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

మరికల్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, గుండంపల్లి మధ్యన ఇథనాల్ కంపెనీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కంపెనీ ఏర్పాటుతో కలిగే లాభనష్టాల గురించి తెలుసుకునేందుకు ఆయా గ్రామాల రైతులు రెండు ప్రైవేట్ బస్సుల్లో చిత్తనూర్‌కు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున మరికల్ జాతీయ రహదారిపై అడ్డుకున్నారు. చిత్తనూర్‌తో పాటు ఇథనాల్ కంపెనీ పరిసరాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదంటూ తిప్పి పంపించారు. వారిని బాలానగర్ వద్ద వదిలేయగా అక్కడే జాతీయ రహదారిపై రైతు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఇథనాల్ కంపెనీతో ముప్పు ఉందనే కంపెనీ వారు పోలీసులతో తమను అడ్డుకున్నారని ఆందోళన చేశారు. వచ్చిన బస్సుల్లోనే నేరుగా గ్రామాలకు వెళ్లాలని లేదంటే కేసులు నమోదు చేసి బస్సులను సీజ్ చేస్తామని పోలీసులు హెచ్చరించడంతో వెళ్లిపోయారు.

జూరాలకు 65వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


జూరాల గేట్ల నుంచి విడుదలవుతున్న వరద నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం 80వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం సాయంత్రానికి 65 వేల క్యూసెక్కులకు తగ్గింది. దీంతో 6 క్రస్టు గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 38,240 క్యూసెక్కుల నీటిని వినియోగించు కుంటున్నారు. క్రస్టు గేట్ల ద్వారా 24,936 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,140 క్యూసెక్కులు, కుడి కాల్వకు 720 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు సమాంతర కాల్వకు 500క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 66,356 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.398 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

సుంకేసులకు తగ్గిన వరద

రాజోళి: తుంగభద్ర శాంతించడంతో సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వస్తున్న వరద శుక్రవారం తగ్గుముఖం పట్టింది. 65,700 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. 15 గేట్లను ఎత్తి 63,105 క్యూసెక్కులను విడుదల చేశారు. మరో 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

డ్యామేజీ మద్యం బాటిళ్ల ధ్వంసం


సర్వీస్ రోడ్డుపై లిక్కర్‌ను ధ్వంసం చేస్తున్న లారీ

జడ్చర్ల: జడ్చర్ల సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై శుక్రవారం డ్యామేజీ మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. అల్లైడ్ బ్లెండర్ డిస్టిలర్స్ కంపెనీ నుంచి ఐఎంఎఫ్‌ఎల్ లిక్కర్‌ను ఓ కంటైనర్‌లో లోడ్‌చేసుకుని రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని ఆర్‌ఆర్–2 డిపోకు రవాణా అవుతుండగా బుధవారం రాత్రి జడ్చర్ల వద్ద జాతీయ రహదారిపై ప్రమాదానికి గురవగా లిక్కర్ కాటన్లు రోడ్డుపై పడటంతో కొన్ని పాక్షికంగా ధ్వంసమయ్యాయి. దీంతో డ్యామేజీ కలిగిన లిక్కర్ బాటిళ్లు విక్రయానికి పనికి రావని భావించిన ఎక్సైజ్ అధికారులు శుక్రవారం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై పరిచి లారీని వాటి మీదుగా ఎక్కించి ధ్వంసం చేశారు. దీంతో రహదారిపై పారిన మద్యం వాసన ఒక్కసారిగా గుప్పుమంది. దాదాపు 500కు పైగా కాటన్ల లిక్కర్‌ను ధ్వంసం చేసినట్లుగా అధికారులు పేర్కొన్నారు. దీని విలువ దాదాపు రూ.30 లక్షలకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి, ఎస్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రంగాపూర్‌లో చోరీ

వంగూరు: మండలంలోని రంగాపూర్‌లో శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ మహేందర్ కథనం ప్రకారం.. శ్రీనివాస్‌రెడ్డి అతని భార్య ఇద్దరూ కలిసి ఇంటికి తాళం వేసి సదగోడు గ్రామానికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి తాళం విరగగొట్టి ఉంది. దీంతో లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో దాచిన 3 తులాల బంగారు, రూ.40 వేల నగదు, వెండి వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే గ్రామానికి చేరుకొని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

క్రీడలకు ప్రాధాన్యమిస్తున్న సర్కార్


ఓవరాల్ చాంపియన్ కల్వకుర్తి జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అధికారులు

- ముగిసిన ఉమ్మడి జిల్లా బీసీ గురుకులాల క్రీడా పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే

కల్వకుర్తి టౌన్: తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లాలోని బీసీ గురుకులాల క్రీడా పోటీలు నిర్వహించారు. శుకవ్రారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. క్రీడాకారులకు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని, ఏకాగ్రత పెరుగుతుందని వివరించారు. చాలామంది గ్రామీణ క్రీడాకారులు అంతర్జాతీయస్థాయిలో రాణించారని తెలిపారు. తెలంగాణ నుంచి ప్రాతినిథ్యం వహించిన ఇద్దరు క్రీడాకారులకు ప్రభుత్వం గ్రూప్–1 స్థాయి డీఎస్పీ ఉద్యోగాన్ని కేటాయించిందని గుర్తుచేశారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి..

క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి క్రీడలు నిర్వహించటంతో వారు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించేలా శిక్షణను ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. పీఈటీలు విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు.

విజేతలు వీరే..

ఉమ్మడి జిల్లాలోని 16 బీసీ గురుకులాల క్రీడాకారులు క్రీడల్లో పాల్గొనగా విజేత జట్లకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బహుమతులు అందజేశారు. మూడురోజుల పాటు జరిగిన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా కల్వకుర్తి బాలికల బీసీ గురుకుల పాఠశాల నిలిచింది. వాలీబాల్‌లో మొదటి బహుమతి కల్వకుర్తి, రెండో బహుమతి నర్వ.. కబడ్డీలో కల్వకుర్తి, తాడూర్.. ఖో–ఖోలో కల్వకుర్తి, ఉయ్యాలవాడ.. చెస్‌లో కల్వకుర్తి, వేపూర్.. క్యారమ్స్‌లో హన్వాడ, న్యూ వెల్టూర్.. టెన్నికాయిట్‌లో కల్వకుర్తి మొదటి బహుమతి, వెల్టూర్ ద్వితీయ బహుమతి సాధించాయి. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీసింగ్, ఉమ్మడి జిల్లా బీసీ గురుకులాల అధికారి వెంకట్‌రెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నకేశవులు, కల్వకుర్తి బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగమణి, ఉమ్మడి జిల్లాలోని 16 బాలికల బీసీ గురుకులాల పీఈటీలు పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ పోటీలకు క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రికెట్ జట్టు సభ్యులతో వీసీ జీఎన్ శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సౌత్ జోన్ ఆలిండియా క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు పీయూ మహిళా, పురుషుల జట్ల ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు మొత్తం 44 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన వారు కర్ణాటక రాష్ట్రం మైసూర్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పీయూ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి తదితరులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో ప్రతిభ చాటాలి


క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న రాజశేఖర్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లా క్రికెట్ అండర్–23 టోర్నమెంట్‌లో క్రీడాకారులు ప్రతిభచాటాలని మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డులోని క్రికెట్ మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్– 23 లీగ్ కం నాకౌట్ టోర్నమెంట్ కొనసాగుతుంది. ఈ సందర్భంగా శుక్రవారం రాజశేఖర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ క్రీడాకారులకు ఈ టోర్నమెంట్ ఒక వేదికలాంటిదని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లా టోర్నీలో రాణించే క్రీడాకారులను రానున్న హెచ్‌సీఏ అండర్– 23 టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు తమ వ్యక్తిగత ప్రదర్శన కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

16 పరుగుల తేడాతో నాగర్‌కర్నూల్ గెలుపు

లీగ్ మ్యాచ్‌లో నాగర్‌కర్నూల్ జట్టు 16 పరుగుల తేడాతో వనపర్తి జట్టుపై గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ జట్టు 44.2 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో తరుణ్ 35 పరుగులు చేశాడు. వనపర్తి బౌలర్లు ఛత్రపతి 4, దినేష్ 2, ప్రణీత్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వనపర్తి జట్టు 31 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో అభిలాష్‌గౌడ్ 56, ప్రణీత్ 34 పరుగులు చేశారు.

'ర్యాలంపాడు'ను సందర్శించిన కేంద్ర బృందం


అధికారులతో మాట్లాడుతున్న మధుసూదన్

ధరూరు: జలశక్తి అభియాన్ కేంద్ర బృందం శాస్త్రవేత్త మధుసూదన్ శుక్రవారం నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన ర్యాలంపాడు లిఫ్ట్–2 పంప్‌హౌస్‌తో పాటు రిజర్వాయర్‌ను అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావుతో కలిసి పరిశీలించారు. పంప్‌హౌస్ నిర్మాణం, మోటార్లు, రిజర్వాయర్‌లోని నీరు ఎన్ని ఎకరాలకు అందుతుందనే వివరాలను పీజేపీ ఈఈ రహీముద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. తాగు, సాగునీటి అవసరాలకుగాను చెరువులకు నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. భావితరాలకు నీటికొరత లేకుండా చూడాలని, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని స్థానిక అధికారులకు సూచించారు.

600 కిలోల నల్లబెల్లం పట్టివేత


పట్టుబడ్డ బెల్లంతో ఎక్సైజ్ అధికారులు

కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి సర్కిల్ పరిధిలో గురు, శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించామని, 600 కిలోల నల్లబెల్లం పట్టుబడగా.. 5 కేసులు నమోదు చేసి రెండు బైక్‌లు సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ కల్వకుర్తి ఎక్సైజ్ బృందం సంయుక్తంగా వంగూరు, ఊర్కొండ మండలాల్లో దాడులు నిర్వహించిందన్నారు. వంగూరు మండలం కిష్టంపల్లి తండా పరిసరాల్లో600 కిలోల నల్లబెల్లం, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేసినట్లు వివరించారు. అలాగే ఉర్కొండలో 10 లీటర్ల సారా పట్టుబడగా ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. కోనేటిపురంలో సారా తరలిస్తున్న బైక్‌ను స్వాధీనం చేసుకొని ఒక కేసు నమోదు చేసినట్లు వివరించారు. కిష్టంపల్లితండా సమీపంలో సారా తరలిస్తున్న బైక్‌ను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సీఐలు శారద, బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐలు సృజన్, అరుణ, సిబ్బంది పాల్గొన్నన్నారు.